కథానిక

# మంచు దెబ్బ

నిడదవోలు మాలతి

పశ్చిమ దిక్కున విచ్చలవిడిగా చెలరేగుతున్న శారద నీరద పంక్తుల్ని చూస్తూ డాబామీద నించున్నాను. ఇవేనేమో వప్రక్రీడాగజ ప్రేక్షణీయంగా కనిపించినవి. నల్లగా బండరాళ్ళలా - కారు ఎనుములాఉన్న ఆ మేఘమాల అస్తమిస్తున్న సూర్యుడ్ని దాచ ప్రయత్నిస్తున్నాయి. సూర్యనారాయణుడు అల్లరిపిల్లవాడిలా అడుగునుంచే చేతులు చాపుతున్నాడు దివ్యకాంతులు విరజిమ్మే ఘనశ్యామసుందరుడు ఇలాగే ప్రకాశించేవాడు కాబోలు. అంత ఎత్తుకు ఎగరలేని రాధ క్రిందనుంచి దిగులుగా - నీ లీలలకి అమాయకనైన నేనే దొరికానా? అన్నట్లు చూస్తుంది కాబోలు ...

... ... నాకూ, మేఘమాలకీ మధ్య వచ్చి నిలచిన రాధ - ఎదురుగా డాబామీద - మెల్లిగా కదిలి నేపథ్యంలోకి మాయమైంది. ఆ నడక తీరు జంకొపవెడి కాళ్ళతోడ మెల్లిగా మెట్లు దిగుతున్న రాచపిల్ల పోలికనుంది.

నాకు తెలిసినంతమటుకు ఆ యింట్లో ఒకే వృద్ధవనితుంది. ఆ యింటికి ఆమే యజమానురాలు. ఆ యిల్లు మా యిల్లు నానుకుని వెనకవేపుకి ఉంది. మూడు తరాలికి ముందు ఆ యింటికీ ఈ యింటికీ ఒక్కడే యజమాని అన డానికి సాక్ష్యం రెండు డాబాల్ని వేరుచేస్తూ నిలచిన మూడడుగుల పిట్టగోడ. రాజమార్గాన సింహద్వారం చేరాలంటే ఓ నూరు గజాలమేర నడిచి రెండు మలుపులు తిరిగి గాని చేరలేం.

రాత్రి భోజనందగ్గిర అమ్మతో అన్నాను. ఆ వెనక యింట్లోకి ఎవరో వచ్చినట్టున్నారే! అని. "ఆ ముసలావిడకి మనవడో ఏదో అవుతాడట. మొన్న పదో తారీకున పెళ్ళయింది. పిల్ల కుందనపుబొమ్మలా ఉంటుంది. ఈ కళ్ళు యిలా తిప్పిందంటే ఆ కనుపాప ఈ చివరకి వస్తూ, ఏం లాభం. ఏదో జబ్బుట. మాటాడదు - అన్నం తినదు గజ్జెల గుర్రంలా దాట్లేసే పిల్ల. జీవచ్ఛవంలా తయారయిందని ఆవిడ గోలెత్తుతోంది". ఔచితికి తగినట్టు అంగన్యాస కరన్యాసాలతో. అమ్మ ఇంతలో ఇంత ఇన్ఫర్మేషను ఎలా సేకరించిందో అన్న ఆశ్చర్యంకన్నా, పెళ్ళయి ఆరు రోజులయినా పెదిమ కదపని ఆ ముద్దరాలి ప్రవర్తన ఆశ్చర్యపరచింది.

" మూగిపిల్లేమో ! " అన్నాను,

" సరేలే ".

తలెత్తి అమ్మవేపు చూశాను - ఎందుకు కాకూడదూ అని.

" పెళ్ళిచూపులనాడు అష్టపది పాడిందట. ఆ పాటకే మురిసిపోయి చేసుకున్నారట ".

" ఏంపాట బాబూ అది " అన్నాను నవ్వుతూ.

" ధీర సమీరే ".

తృళ్ళిపడ్డాను. ఆపాట మనోరంజకంగా పాడిన మనిషి నాకు తెలుసు. నేను గుంటూరులో చదువుకొంటున్న రోజుల్లో నాతోపాటు స్కూలుకి వస్తూ థర్డ్ ఫారం చదివిన వకుళ అది. తన పాట విని పెళ్లి చేసుకోడం ఒక ఉద్ధరింపు కాదు. తనపాటకి పాములే ఆడతాయి. స్కూల్లో ఖడ్గతిక్కన డ్రామాలో వార్తాహారుడుగా ఒకటిన్నర నిముషం స్టేజిమీద కనిపించి కంఠ మాధురితో ప్రేక్షకుల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన వకుళ, తిక్కన మరణించాడని చెప్పడానికొచ్చి - చానమ్మ వీరపత్నిగా ఆచంద్ర తారార్కం కీర్తింపబడుతుందని చెప్పుతాడు వార్తాహారుడు. వకుళ పద్యం చదువుతుంటే స్థాణువులైన ప్రేక్షకులు వన్స్‌మోర్ అంటూ కేకలేస్తే చానమ్మకి అయ్యో అనడానికైనా అవకాశం లేకపోయింది. నేను సాయంత్రం డాబామీద చూసింది ఆ వకుళ నన్నమాట.

మా వూళ్ళో శలవుల్లో తోచదని ఇక్కడికొచ్చి, ఇక్కడ కాలక్షేపం కోసం కొట్టుకుపోతున్న నాకు నచ్చిన స్నేహితురాలు దొరికిందని సంతోషించాను. కాని ఇంతలోనే జ్ఞాపకం వచ్చింది- మతే పోయిందో, మనసే పోయిందో, రోగమో, నొప్పో ఏదీ తెలీదు. కన్న తల్లిదండ్రులతోనూ, కట్టుకున్న భర్తతోనూ మాటాడని వకుళ నాతో మటుకు మాటాడుతుందా ? వాళ్ళకంటే నేనెక్కువా ? అందులో మా చుట్టరికం ఏనాటిమాట ! !

ఆఖరికి అమ్మమీద విసుక్కున్నాను. " మాటాడ్డానికి కాదు కదా దెబ్బలాడ్డానికేనా ఎవరూలే నడవి, నేఁ రాను అంటుంటే తీసుకొచ్చేవు " అంటూ.

వకుళ పగలంతా ఎక్కడా కనిపించలేదు - కాని సాయంత్రం సరిగ్గా నిన్నటి వేళకి డాబామీదకి వచ్చింది. ఆకాశం ముసురేసి ఉంది. చినుకు పడితే తగలబడిపోతుందని డాబామీద ఎండబెట్టిన ఆవకాయ ఎత్తిపెట్టడానికి, వచ్చింది అమ్మ, నేనూ సాయం వెళ్ళాను.

వకుళని పిలుద్దాం అనుకుంటుంటే, పొట్టిగా ఉన్న నల్లనివా డొకతను వచ్చి "అమ్మా, వాళ్ళెవరూ ఇంట్లో లేరు. నేవలా వెళ్తున్నాను" అన్నాడు. వకుళ అతనివేపు అలవోకగా చూసి ముఖం తిప్పుకుంది.

"ఏం ?" అన్నాడతను మళ్ళీ.

వకుళ ఈ మారు ఆమాత్రం కూడా చూడలేదు.

"ఛీ. మనిషి, అత్తకి చూపు చేటూ. కోడలికి మోపు చేటూను" అతను సణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

సరసుడే అనుకున్నాను.

వకుళకి నాకూ చిత్రమైన స్నేహం ఉండేది. మే మిద్దరం కలిసి ఆడుకున్నవాళ్ళం కాదు. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్న వాళ్ళమూ కాదు, కాని వకుళ దేనికైనా బాధ పడితే నా దగ్గర కొచ్చి కూచునేది. మా యిద్దరిమధ్య మాటలూ, సమస్యలూ, సమాధానాలు లేకపోయినా మాకేమీ వెలితి ఉండేదికాదు. ఎదుటిమనిషి కాల్లో ముల్లు విరిగితే తన గుండెలో గునపం గుచ్చినట్టు విలవిలలాడే వకుళ "ఛీ" అనిపించుకుంటూ జీవిస్తోందంటే ఏదో జరిగి ఉండాలి. కాని అది ఏమిటి? కడుపులో బాధ కన్నతల్లికే చెప్పుకోని వకుళ నాకు చెప్పుతుందని నేను అనుకోలేదు. కాని ఒకటో రెండో కథలు కల్పించి వ్రాసిన నాకు వకుళ మౌనధారణ మటుకు క్లూ దొరకని పజిల్ లా ఉండిపోయింది - రాత్రంతా ఆలోచించినా. మర్నాడు పొద్దున్న అమ్మ మళ్ళీ డాబామీదికి రావడంతో స్నానంచేసి నేనూ వచ్చేను. వకుళ బట్టలు ఆరేస్తోంది - వాళ్ళ డాబామీద.

తెగించి పిలచాను.

వకుళ వులికిపడి నావేపుచూసి వెళ్ళిపోయింది,

"ఏం నువ్వు దిగి వచ్చేవనుకొంటున్నా వేమిటి ?" అంది అమ్మ - వకుళ నాకు సమాధానం చెప్పలేదని.

"ఏం జబ్బా ?" అన్నాను సాలోచనగా.

"జబ్బేమిటి ? తెగులు" అంది అమ్మ.

నేను తెల్లబోయాను.

నిన్నగాక మొన్న తన స్థితికి జాలి ప్రకటించిన అమ్మ ఇవాళ ఇంత కఠినంగామాట్లాడ్డానికి వకుళ చేసిన నేరం ఏమిటో ?

అమ్మ దగ్గిర్నుంచి నేను రాబట్టగలిగిన కథ యిది. ముందురోజు సాయంత్రం వకుళ అత్తగారు ఒక పొరుగు వెలుగుతో వచ్చీసు ఆడుతుండగా, ఆ మెభర్త నరహరి వీధిలోకి వెళ్ళిపోయాడు వకుళతో చెప్పి. (అది నిజం అనడానికి నేనే సాక్ష్యం!). అలా అతను చల్లని సాయంత్రంవేళ షికారు వెళ్ళిన సందర్భం ఆసరా చేసుకుని దారిన పోతున్న ఒక సీజరు సావిట్లో ఉన్న రేడియో, అక్కడే కుర్చీమీద నీటుగా ఇస్త్రీచేసి ఉంచిన పట్టుచీరా తీసుకుని వెళ్ళిపోయాడు. అతడు ఇంట్లో ప్రవేశించిన దగ్గిర్నుంచి మండువాలో మంచంమీద నున్న వకుళ అలా చూస్తూనే ఉందట - పరమానందయ్య శిష్యుడికైనా సిగ్గు తెప్పించగల నిశ్చలతతో.

"చిత్రంగానే ఉంది" అన్నాను, నవ్వుతూ,

"నీకు సరదాగా ఉందేం - మూటయ్యాభై రూపాయల ఆరణిచీర" అంది అమ్మ. ఆ చీర తనదే అయినట్టు.

చీర స్వంతదారే చీరె పోతున్నదారి చూస్తూ వూరుకుంటే నాకెందుకు నొప్పి? కాలుజారి పడేవాళ్ళు పడితే నవ్వగలిగినవాళ్ళు నవ్వారాదంటుంది అమ్మ. ఆ పరిస్థితిలో అది నా చీరే అయినా నేను నవ్వి ఉండేదాన్ని, "కాఫీకలరు ఆరెంజి బోర్డరు - ఎలాఅంటె అలా ఉండేది" అంది అమ్మ మళ్ళీ.

గతుక్కుమన్నాను.

"పెళ్ళిచీరలన్నీ కొనడం అయిపోయాక, వకుళ ఆ చీరె చూసి పట్టుబట్టి కొనిపించింది"ట. ఆడవాళ్ళకి చీరమీదున్న మోజు కట్టుకున్న మగవాడిమీదైనా ఉండకపోవడంవల్లే సంసారాల్లో కలతలు వస్తున్నాయని ఒక ప్రాజ్ఞుడి అభిప్రాయం. వకుళ కోరి తెచ్చుకున్న పట్టుచీరె చేజేతులా పారేసిందంటే ఈమారు నాకు నవ్వు రాలేదు. తనకి ఆరంజి బోర్డరుమీదున్న ప్రేమ నాకు తెలియంది కాగు

రోజూ సాయంత్రం అదే వేళకి వాళ్ళ డాబామీద తనూ మా డాబామీద నేనూ చేరేవాళ్ళం. మూడు రోజులు పోయాక కాబోలు నావేపు చూసింది. ఆ చూపులో గుర్తించానన్నట్టయితే నేను చిర్నవ్వు నవ్వేను. వకుళ గిరుక్కున వెనుతిరిగి వెళ్ళిపోయింది! కిందకొచ్చి మంచం వాల్చుకుని పడుకున్నాను...

... చిన్నకునుకు తీశాను కాబోలు కళ్ళు విప్పేవేళకి వెనకగదిలో ఎవరో మాటలు వినిపించాయి. కంఠం పరిచయమైనట్టే వినిపించింది. ఆవిడ

వకుళ వాళ్ళ అమ్మ. నన్ను చూడగానే, "కల్యాణి కదూ! ఎంత గొప్పదానివయ్యావు!" అంది.

చీరెసంగతి తెలిసి ఆవిడ వచ్చిందిట. ఆవిడకీ వకుళ సంగతేమీ అర్థం కాలేదు. రోజుకొక డాక్టర్‌కి చూపిస్తున్నారు, ఎక్స్‌రేలు తీయిస్తున్నారు. స్పెషలిష్టులని కలుసుకున్నారు. లాభం లేకపోయింది. అసలు పేషంటు తన బాధేమిటో చెప్పకపోతే డాక్టరేం చేస్తాడు. దేవుఁడే 'నీ కేం కావాల'ని అడిగికాని వరం ఇవ్వడు. పిచ్చాసుపత్రికి తీసికెళ్ళారు - ఇదేదైనా పిచ్చి సంబంధ మేమోనని. రెండు రోజులు అక్కడ ఉంచమన్నారుట. సరేనని నరహరి స్పెషల్ వార్డులో ఒక గది తీసుకుని అందులో వుంచాడు. కాని వకుళ మాటాడలేదు. మాటలాడకపోవడం తప్ప ఆమెలో ఏ లోపమూ లేదు. అన్నిరకాల టెస్టులూ అయ్యాక, "ఆ పిల్లకేంపిచ్చి - అలా అన్న వాళ్ళకి పిచ్చి. ఆ అమ్మాయి జబ్బు మనోవ్యాధి. ఆ అమ్మాయి కేం కావాలో కనుక్కోండి" అన్నాడు ఆ పిచ్చి డాక్టరు.

"మీకు పిచ్చిలా ఉంది. దానికి నిజంగా వట్టి మనోవ్యాధే అయితే మేం తీసికెళ్ళిన డాక్టర్లందరిదగ్గిరికీ అదెందుకు వస్తుంది?" అంది వకుళ తల్లి వరలక్ష్మమ్మ.

డాక్టరు నవ్వి, "నేఁ వ్రాసిస్తానమ్మా! ఆ అమ్మాయి కేవిధమైనజబ్బు లేదని, మీరు ఇంగ్లండు తీసికెళ్ళినా అంతే, బహుశా ఈ పెళ్ళి ఇష్టం లేదేమో!" అన్నాడు.

వరలక్ష్మమ్మగారు పిల్లని తీసుకొచ్చేశారు.

పెళ్ళి నిశ్చయం అయినపుడు వకుళ బొత్తిగా డాన్సు చెయ్యలేదు కాని మరెలాంటి కళలూ చూపలేదు. పల్లెటూళ్ళో నాయనమ్మ సమక్షంలో పెరిగిన వకుళ ప్రేమలూ - పెళ్ళిళ్ళూ అంటూ రేగే అవకాశం లేదు. అట్టి సంగతి వకుళ ఎరుగనిది, పైగా ఈ మూగనోము పట్టింది పెళ్ళయిన నాలుగో రోజునుంచి.

ఇంట్లో వంటపని ముసలావిడి చూసుకున్నా, పైపనంతా చేసేది, చేసినపని చేతకానట్లు చేసినట్టు గాని, అఇష్టంగా చేసినట్లు గాని ఉండేది కాదు.

ఆఖరికి నరహరి "నీకేం కావాలో చెప్పు-నేఁ సాధించుకొస్తానన్నాడు"

ఆపద మొక్కులవాడికి మొక్కుకున్నారు - నిలువుదోపిస్తానని. నరహరి సైకాలజిస్టు దగ్గిరికి తీసికెళ్ళాడు. అతను సవాలక్ష ప్రశ్నలు వేశాడు,

ఆ అమ్మాయి పెరిగిన వాతావరణం ఎలాటిది ? తల్లిదండ్రులు ఎలాటివారు? అమ్మాయి అభిరుచు లేమిటి ?

నరహరి తనకి తోచిన సమాధానాలు చెప్పాడు. అవేమంత సంతృప్తి కరంగా లేవు చివర్న " రోజూ సూర్యాస్తమయం వీక్షిస్తుం దని " చెప్పాడట. తనని ఆయన ఆ సమయంలో చూస్తానన్నారట.

ఆవేళ సాయంత్రం పిట్టగోడకి ఇటు నేనూ అటు వకుళా నిల్చుని ఉండగా ఆయన వచ్చేరు.

నేను బాగుండదేమోనని వెను దిరగబోయాను.

వకుళ నా చెయ్యి పుచ్చుకుని ఆపింది. నేనూ తన భావం గ్రహించు కుని అక్కడే నిలబడ్డాను. ఆ ప్రొఫెసర్ వేసే వెయ్యినొక్క ప్రశ్నలకి తను సమాధానం చెప్పదు (చెప్పలేదో ?) లేకపోతే తనకి మిగిలిన ఈ ఒక్క గడియ ఆనందాన్ని తనకి కాకుండా చేయ నుంకించిన ఈ మానవుణ్ణి పొమ్మని చెప్పమనో,

" ఇవాళ ఆకాశం బాగులేదు " అన్నారాయన,

వకుళ ఒక్క క్షణం ఆయన వేపు చూసి డాబా పిట్టగోడ దూకి మా ఇంట్లోకి వచ్చేసింది ! తరువాతి క్షణంలో అక్కడ ఎదురెదురుగా నిల బడింది నేనూ, వకుళ మనోగతాభిప్రాయాన్ని కనిపెట్టడాని కొచ్చిన సైకాలజిస్టూను !!

" ఆ అమ్మాయిని మీ కెంతకాలంనుంచీ తెలుసు ? " అని ప్రశ్నించా డాయన నన్నుద్దేశించి,

" నా కెంతకాలంనుంచీ తెలీదు, నేను ఫిఫ్తు ఫారం చదువుతున్న రోజుల్లో ఆ అమ్మాయి థర్డు ఫారం చదువుతుండేది " అన్నాను.

వకుళని గురించి నాకు తెలిసింది చెప్పమని అడిగారు.

వెనక్కి తిరిగి చూశాను. వకుళ నా గదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని రెండు చేతుల్తో కళ్ళు మూసుకుంది.

" మీరు సైకాలిజిస్టు కనక తననిగురించి నాకు తెలిసింది చెబుతున్నాను. అది కేవలము నా ఊహే కావచ్చు కూడా. నాకు తెలిసినంతవరకు వకుళ పువ్వువంటి మనిషి. పసిపాపవంటి అమాయకురాలు. పుస్తకాలలో ఎత్తి చూపే మోసమూ, దగా, స్పర్ధలూ, అసూయలూ పుస్తకాల్లోనే తప్ప నిజంగా ఉండవని నమ్మిన ముగ్ధ. తనని చూస్తోంటే ఎప్పుడో ఎక్కడో చదివిన

వాక్యాలు నాకు గుర్తుకొస్తాయి. బహుశా మీరూ చదివే వుండవచ్చు. ఒక అడదానికి మతి భ్రమించిందంటే ఒక మహాకవయిత్రి మనకు దక్కకుండ పోయినట్టు అని. ఒక అడవిమనిషి మూలికలు ఏరుకుంటూ తిరుగుతోందంటే ఒక ధీశాలిని మేధస్ వృధా అయిపోయిం దన్నమాట అని. వకుళని చూస్తుంటే నాకు అదే జ్ఞాపకం వస్తుంది" అన్నాను.

"అది నిజమే కావచ్చు. కాని ఆ అమ్మాయిలో ఆ మార్పు తెచ్చిన సంఘటన ఏదో కనుక్కోండి - ప్రయత్నించి. ఒక మనిషి షాక్ తినడం ఎంత సహజమో, దానినుండి తేరుకోడం కూడా అంతే సహజం. కారణం తెలిస్తే, మళ్ళీ దానికి ప్రతి ఆలోచించవచ్చు"

ఆయన వెళ్లిపోయినా, నాకు వకుళ దగ్గిరకి వెళ్ళడానికి తగినసాహసం లేకపోయింది. తనకి ఇష్టమైన ఆ సాయంశోభని తిలకిస్తూ నిలబడ్డ నాకు తను వచ్చి నా వెనకే నిలబడ్డం తెలీలేదు. తన మొహం చూశాక దొంగతనం చేసినట్టు ఫీలయేను.

వాళ్ళమ్మని చూస్తే జాలివేసింది. అర్థాయుష్కుడైన కొడుకా ?— ఐదవతనం లేని కూతురా - అన్నట్టు నలభై పడిలో పడ్డాక ఒక్క కూతురు. ఆ ఒక్క కూతురు బ్రతుకూ ఇలా తెల్లవారుతోంది.

నిజంగా వకుళకి ఈ పెళ్ళి ఇష్టం లేకపోతే, పిల్లని తమ వూరు తీసికెళ్ళి పోడానికి తయారుపడుతోంది ఆవిడ. తల్లిప్రాణం.

వకుళ ఎంతో కాన్ఫిడెంట్ గా నా ప్రక్కన వచ్చి నిలబడడం గుర్తు కొచ్చింది. ఏలా ప్రశ్నించను నీ మిష్టరీ ఏమిటి ? అని. అది మిగిలిన వాళ్ళ కెలా చెప్పను ? చరిత్రలో విభీషణుడిదగ్గిర్నుంచి అన్ని దేశాల్లో అన్ని కాలాల్లో ఉన్నవాళ్ళ పేర్లు కళ్ళముందు కదిలేయి. నా ద్రోహానికి శిక్ష ఉండదు. కాని వకుళ మామూలు మనిషయితే ఎందరు సంతోషిస్తారు; నాకు మటుకు అది సమ్మతం కాదూ !

మర్నాడు పొద్దున కాఫీ తాగి నేను "వాళ్ళింటి కెళ్తాను" అన్నాను.

"అక్కర్లేదు" అంది అమ్మ.

తరవాత తెలిసింది. దయ్యం పట్టిందేమో - అన్నారట ఎవరో.

భూత వైద్యుడ్ని పిలిపించారు. వాడు వకుళని నఖశిఖపర్యంతం నాలుగుమూల్లు చూశాడు. తనచుట్టూ తిరిగాడు. "మూగదయ్యం"

అన్నాడు. అయిదు వందల రూపాయలు కుప్ప పోయించాడు. దానిమీద చక్రం గీశాడు. నాలుగుకూతలు కూశాడు.

"పలుకు" అన్నాడు. వకుళ పలుకలేదు.

వేపమండలు పెట్టి బాదేడు. పసుపూ, కుంకుమా, బూడిదా ఇల్లెల్లా జల్లేడు, "అమ్మా" అను అన్నాడు వకుళ అనలేదు. వాడు వెళ్లిపోయాక, వకుళ కుడిచేతిమీద మణికట్టు నుంచి మధ్యవేలు వరకూ జెర్రిలా ఉన్న ఎర్రని గీత చూసి ఎవరికీ నోట మాట రాలేదు.

నిజంగా ఆ అమ్మాయికి ఏ జబ్బు ఉందో, దానివల్ల ఏం బాధ అనుభవిస్తోందో తెలీదు కాని, ఈ ట్రీట్‌మెంట్ పేరున వీళ్ళుమట్టుకు తనని హింస పెడుతున్నారు. 'ఎందుకొచ్చిన మందులండీ - ఇవీ. అసలు జబ్బుకన్న వీటిబాధే ఎక్కువగా ఉన్నట్టుంది. కొన్నాళ్ళపాటు ఊరుకోండి. అవే సర్దుకుపోతాయి" అన్నాను వరలక్ష్మమ్మగారితో.

"అదే అనుకుంటున్నాం మేం కూడా. పైగా నిన్న అతడు కూడా మాయచేసి పశువుని అంటగట్టేరని విసుర్లు విసిరేడు. మాణిక్యంలాంటి పిల్ల ఇలా అయిపోయిందని మేం ఏడుస్తుంటే ఈ పోటుమాటలు. ఏదవుతే అదవుతుంది, దాన్ని తీసుకుపోతాం. బాగుంటేనే పంపిస్తాం" అంది ఆవిడ.

వకుళ పరిసరాల్లో జరుగుతున్న విషయాల్ని పట్టించుకోకపోతే, గ్రహించుకోలేకపోతే తనంత అదృష్టవంతురాలు మరొకతి ఉండదు అనుకున్నాను.

ఆ సాయంత్రం వకుళని చూడ్డానికి వెళ్ళాను - మర్నాడు ఉదయం వెళ్ళిపోతుందని. నేను ఇంట్లో ప్రవేశించగానే, నా వెనకే నరహరి ప్రవేశించాడు.

"మీరు తీశికెళ్లి ఆ పల్లెటూళ్ళో ఏంచేస్తారు. నాతోనే పంపించండి. అక్కడ నా స్నేహితు డొకడు స్పెషలిస్టున్నాడు. చూపిస్తాను" అన్నాడు. నోరూ వాయీ లేని లేగదూడవంటి అమాయకురాల్ని తొమ్మిదివందల మైళ్లు పంపిస్తారా ? వరలక్ష్మమ్మగారు విచిత్రంగా చూశారు - అతనివేపు.

"అవును నాతోనే తీసికెళ్ళి - నేనే ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను".

అంతవరకు అక్కడ తనని కాదన్నట్టు నిర్వికారంగా కూచుని ఉన్న వకుళ భర్తవేపు తన దృక్కులు సారించింది.

అది తపోనిష్ఠుడైన ఫాలాక్షుడు మూడో కన్ను విప్పి మన్మథుడ్ని

చూసిన చూపు. యుగయుగాలుగా మగవాడి అన్యాయానికి వినయంతో తలవంచి స్త్రీత్వం మేలుకొని కళ్ళు విప్పిన చూపు. గగనంలో విహారిస్తున్న గరుత్మంతుని శివుని కంఠహారమైన కోడెత్రాచు చూసే చూపు.

ఆ చూపులో శ్లేష లేదు. నరహరి తల వంచుకుని వెను తిరిగి వెళ్ళి పోయాడు.

ఆ రాత్రి గాలి లేదని మంచం డాబామీద వేసుకున్నాను. వకుళ గురించిన ఆలోచన్లు నిద్ర పోనీయలేదు. వకుళకి ఈ పెళ్ళి ఇష్టం లేదు అనడంలో సందేహం లేదు. యుగధర్మానికి ఎదురు చెబుతున్న ట్టనిపించింది. అతడు నవమన్మధుడు కాకపోవచ్చు, కాని తలిదండ్రులు మెడలు విరిచి చేసినది మట్టుకు కాదు. మొదట తనెందుకు వూరుకుంది ?

ఎపుడు నిద్ర పట్టిందో, తెలివొచ్చేసరికీ గదిలో గడియారం రెండు కొట్టింది - మంచంమీద ఎవరో ఉన్నట్టయింది - వకుళ !

నేనూ లేచి కూచున్నాను. పున్నమచంద్రుడు పిల్లజమీందారులా వెన్నెలలు విరజిమ్ముతున్నాడు, వెన్నెట్లో తన కళ్ళు నీటిలో చేపల్లా మెరుస్తున్నాయి.

ఏదో మాట్లాడాలనిపించింది. తనకి ధైర్యం చెప్పాలనిపించింది. కాని స్తబ్ధనిశీధిలో జడప్రకృతిలో జడభరతునిలా వకుళ - ప్రకృతిలో ఒకభాగంగా కనిపించింది. 'నేను తనకి ఏం చెప్పగలను ? దేవతలకు పంచాంగం చెప్ప గలదానిని కాను నేను.

" కల్యాణీ "

" వకుళా ! ! "

వకుళ మాటాడుతోంది. వంద ప్రశ్నలు వెయ్యాలి. ఏది ముందు ? ఏది వెనక ? వకుళ నిశ్శబ్దంగా నా చేతిని తన చేతిలోకి తీసుకుంది.

" కల్యాణీ ! అతను తృతీయా ప్రకృతి కలవాడు ".

నిస్సహాయంగా వకుళ ఆడిన మాట వికృతంగా ధ్వనించింది. తను ఇంక చెప్పవలసిందేమీ లేదు, తనని గురించిన మిస్టరీ ఏమీ లేదు.

మంచుదెబ్బ తిన్న తమ్మిపువ్వు, నలిపి పారేసిన గులాబీపువ్వు మళ్ళీ మొహం ఎత్తదు.

వకుళ వెళ్ళిపోవడం నాకు తెలీదు, నేను నిద్ర పోవడం నాకు తెలీదు. మళ్ళీ నాకు తెలివొచ్చేసరికి ఆంగ్లంలో వార్తలు చెబుతున్నారు భరణిప్పు

ముక్క తీస్తూ బాత్‌రూమ్‌వేపు వెళ్తున్న నన్ను చూసి అమ్మ "వకుళ" అంది.

"అవును" అనబోయి అమ్మ మొహం చూసి ఆగిపోయాను.

వకుళ చచ్చిపోయింది !

అరుగుమీద వకుళ శవంచుట్టూ చేరి అందరూ ఏడుస్తున్నారు. నాకు తెలీకుండానే ఒక నిట్టూర్పు వెలువడింది. వకుళ సుఖపడింది. వరలక్ష్మమ్మ గారు - తల్చుకు తల్చుకు ఏడుస్తూంది, వాళ్ళ నాయనమ్మ ముందుగా చెప్పి చచ్చిపోయిందిట. అలాగే దీనికీ తెలుసేమో అని ఆవిడ బాధ.

రాత్రి హఠాత్‌గా కడుపునొప్పి వచ్చి చుట్టుకుపోవడం మొదలు పెట్టిందిట. ఆస్పత్రికి తీసుకెళ్తూంటే సగం దారిలోనే ప్రాణం పోయిందిట,

చూడలేక వెను దిరిగాను, నరహరి గేటుదగ్గిర నిలబడి కల్లబొల్లి ఏడుపులు ఏడుస్తూన్నాడు: లాగి చెంపపెట్టు పెడదామనిపించింది.

♦ ♦ ♦

వకుళ జీవితం అలా ముగిసింది. కాని నరహరి ఎందుకు పెళ్ళి చేసుకున్నాడు ? అంత డబ్బు ఎందుకు ఖర్చుపెట్టాడు అని నన్నడక్కండి. వట్టి పుణ్యానికి అబద్ధం చెప్పేవాళ్ళు, వృథాన్యార్థభంగము గావించెడు వాళ్ళూ - రెండు రూపాయలు ధర్మం చేసి మూడు తరాల పేరు చెక్కించేవాళ్ళూ - వాళ్ళనెవరినైనా అడిగితే చెబుతారు - సమాధానం.

## రచయితలకు విజ్ఞప్తి.

మేము కోరితేనే తప్ప రచనలు పంపవద్దని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము. రచయితలు తమ చిరునామాను మాత్రం ఒక కార్డుద్వారా తెలియజేస్తే, అవకాశాన్నిబట్టి స్వయంగా రచనకోసం మేము అర్థించగలము. ఈ విధంగా రచయిత గౌరవస్థాయి పెరుగుతుందని మా భావన.